ఉమ్మడి జిల్లాలో అత్యల్ప ఉష్ణోగ్రతలు



జిల్లా	ప్రాంతం	ఉష్ణోగ్రత (డిగ్రీల్లో)
వికారాబాద్	యాలాల్	8.1
రంగారెడ్డి	శేరిలింగంపల్లి	9.8
మేడ్చల్	మేడ్చల్	11.9



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రతీక్ జైన్

భవిత భవనాల పనులు చేపట్టాలి

వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్ జైన్


వికారాబాద్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో నూతనంగా మంజూరైన భవిత భవనాల నిర్మాణ పనులను వెంటనే మొదలు పెట్టాలని కలెక్టర్ ప్రతీక్‌జైన్ అధికారులకు ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాఠశాల భవనాల మరమ్మతులు, యూనిఫాం, డ్రాప్ బాక్స్, విద్యుత్, టాయిలెట్స్ తదితర అంశాలపై ఎంపీడీవో, పంచాయతీ రాజ్, ఈడబ్ల్యూఐడీసీ ఏఈలు, ఆదర్శ పాఠశాలల ప్రిన్సిపాళ్లు, కేజీబీవీ ప్రత్యేక అధికారులు, ప్రధానోపాధ్యాయులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. పెద్దేముల్, తాండూరు, చౌడాపూర్ మండలాలకు నూతనంగా మంజూరైన భవిత కేంద్రాల పనులు ప్రారంభించి పూర్తి చేయాలన్నారు. పాఠశాల భవనాలపై నీరు నిలవకుండా చూడాలన్నారు. ప్రతి పాఠశాలలో విద్యార్థులకు అనుగుణంగా టాయిలెట్లు ఉండేలా చూసుకోవాలన్నారు. పదో తరగతిలో మంచి ఫలితాలు వచ్చేవిధంగా విద్యార్థులను సన్నద్ధం చేయాలన్నారు. పాఠశాలల్లో ముఖ హాజరు తప్పనిసరిగా పాటించాలని ఆదేశించారు. మండల విద్యాధికారులు పాఠశాలలను ఎప్పటికప్పుడు తనిఖీలు చేయాలని సూచించారు. వసతి గృహాలకు, పాఠశాలకు నాణ్యమైన బియ్యాన్ని సరఫరా చేయాలని, ఎప్పటికప్పుడు విద్యుత్ సమస్యలను పరిష్కరించాలన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ సుధీర్, అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ హర్ష్ చౌదరి, డీఈవో రేణుకాదేవి, పంచాయతీ రాజ్ ఈఈ ఉమేష్, ఎంఈఓ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో బిర్సా ముండాకు ఘన నివాళి



నివాళులర్పిస్తున్న అధికారులు

మేడ్చల్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జన్ జాతీయ గౌరవ్ దివస్‌లో భాగంగా ఆదివాసీల విప్లవ యోధుడు బిర్సా ముండా చిత్రపటానికి శనివారం కలెక్టరేట్‌లో ఘనంగా నివాళులర్పించారు. జిల్లా గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి పాల్గొని కార్యక్రమాన్ని ప్రారం భించారు. ఆదివాసీ విప్లవ యోధుడు బిర్సా ముండా సేవలను స్మరిం చుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి పద్మజ, జిల్లా షెడ్యూల్ కులాల అధికారి వినోద్, తదితరులు పాల్గొన్నారు.



ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు ఉపాధ్యాయ అర్హత పరీక్ష(టెట్) టెన్షన్ పట్టుకుంది. 2009 తర్వాత నియామకమైన, పదోన్నతులు పొందిన ఉపాధ్యాయులు కూడా టెట్ ఉత్తీర్ణులు కావాల్సిందేనన్న అత్యున్నత న్యాయస్థానం తీర్పుతో జిల్లాలోని ఉపాధ్యాయులు గుబులు చెందుతున్నారు. రెండేళ్లలో టెట్ అర్హత సాధించకపోతే ఉద్యోగ విరమణ చేయాల్సిందేనన్న సుప్రీంకోర్టు తీర్పుతో ఆందోళన చెందుతున్నారు. ఐదేళ్లలోపు ఉద్యోగ విరమణకు సర్వీసు ఉన్న ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయింపు లభించగా మిగతా ఉపాధ్యాయులకు ఉద్యోగ భవిష్యత్తుపై బెంగ పట్టుకుంది.

మినహాయింపునివ్వాలి



సర్వీసులో ఉన్న ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయింపు ఇచ్చే విధంగా రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలి. డీఎస్సీ, ఇంటర్వ్యూల ద్వారా ఎంపికై ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న వారు కూడా ఇప్పుడు టెట్ ఉత్తీర్ణులు కావాలన్న నిర్ణయం సరైంది కాదు. రెండేళ్లలోగా టెట్ అర్హత సాధించక పోతే ఉద్యోగ విరమణ చేయాలనడం కరెక్ట్ కాదు. సుప్రీంకోర్టు తీర్పుపై కేంద్రం పునఃసమీక్ష చేసి ఉపాధ్యాయులకు న్యాయం చేయాలి

- పట్లోళ్ల సత్యనారాయణరెడ్డి, టీయూటీఎఫ్ వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు

టెట్.. టెన్షన్

ఉపాధ్యాయుల్లో గుబులు.. పొంచి ఉన్న ఉద్యోగ గండం

- రెండేళ్లలోపు అర్హత సాధించకుంటే విరమణ తప్పదు
- ఐదేళ్ల సర్వీస్ మిగిలి ఉన్న వారికి మినహాయింపు
- జిల్లాలో 900 మంది ఉపాధ్యాయులకే టెట్ అర్హత
- 600 మంది సేఫ్..
- 2,360 మందికి తప్పని పరీక్ష



వికారాబాద్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): విద్యా హక్కు చట్టం ప్రకారం ఉపాధ్యాయ నియామకాలకు సంబంధించి టెట్ తప్పనిసరి చేస్తూ 2010 ఆగస్టు 23న ఎన్‌సీటీఈ ఉత్తర్వులు జారీ చేసింది. 2010 తర్వాత నియాకమైన ఉపాధ్యాయులు టెట్ అర్హత సాధించిన వారే ఉన్నారు. టెట్ అర్హత సాధించిన వారికే డీఎస్సీకి దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పిస్తున్న విషయం తెలిసిందే. కాగా, సర్వీసులో ఉన్న ఉపాధ్యాయులకు అప్పటి రాష్ట్ర ప్రభుత్వం టెట్ నుంచి మినహాయింపునిచ్చింది. విద్యా హక్కు చట్టం అమల్లోకి వచ్చిన తర్వాత ఉమ్మడి రాష్ట్రంలో 2012 డీఎస్సీ నిర్వహించగా, తెలంగాణ ఆవిర్భవించిన తర్వాత 2012, 2017, 2024లో డీఎస్సీలు నిర్వహించారు. ఈ డీఎస్సీల ద్వారా జిల్లాలో 750 మంది వరకు

మిగతా 8వ పేజీలో...

అందరికీ ఒకే సిలబస్

సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సర్వీసులో ఉన్న ఉపాధ్యాయులు కూడా టెట్ పరీక్షకు హాజరయ్యేలా జీవోలో సవరణ చేశారు. బీఎడ్, డీఎడ్‌తో సంబంధం లేకుండా ప్రస్తుతం ఎస్జీటీగా కొనసాగుతున్న టెట్ అర్హత లేని ఉపాధ్యాయులు, ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎంలు, పేపర్-1 పరీక్ష రాయాల్సి ఉంటుంది. ఇంతకుముందే పేపర్-1 ఉత్తీర్ణత సాధించిన వారు మళ్లీ రాయాల్సిన అవసరం లేదు. టెట్ లేని ఎస్జీటీలు స్కూల్ అసిస్టెంట్ పదోన్నతి కావాలన్నా.. స్కూల్ అసిస్టెంట్లకు జీహెచ్ఎం పదోన్నతులు కావాలన్నా పేపర్-2 ఉత్తీర్ణత సాధించాల్సి ఉంటుంది.



సర్టిఫికెట్ అందుకుంటున్న డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌రెడ్డి

కొడంగల్ కళాశాలకు ఐఎస్‌వో సర్టిఫికెట్

కొడంగల్ రూరల్, నవంబర్ 15 (ఆంధ్రజ్యోతి): కొడంగల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలను శనివారం అంతర్జాతీయ నాణ్యతా ప్రమాణాల సంస్థ ప్రతినిధి శివయ్య పరిశీలించారు. కళాశాలలో వసతులు, బోధన, పరిపాలన, ప్రయోగశాలల్లో పాటిస్తున్న నాణ్యతా ప్రమాణాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ప్రిన్సిపాల్‌కు 2025 - 26 సంవత్సరానికి గాను ఐఎస్‌వో 21001 : 2018 నాణ్యతా ప్రమాణ పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డా.శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ తమ కళాశాలలో విశాలమైన తరగతి గదులు, ఆధునిక ప్రయోగశాలలు, డిజిటల్ తరగతి గదులు, లైబ్రరీ, ఎన్ఎస్ఎస్, ఈ-గవర్నెన్స్, విద్యార్థి కేంద్రం, నైపుణ్య ఆధారిత విద్య అందిస్తున్నామని తెలిపారు. తనిఖీ సభ్యుల సూచనలను పాటించి కళాశాల అభ్యున్నతికి కృషి చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ రఫియా ఖానం, ఐక్యూఏసీ కో ఆర్డినేటర్ రాంబాబు సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రతి అక్షరం.. సమాజానికి అంకితం

Sunday Special

చిన్నతనంలోనే తండ్రి మరణించాడు.. తల్లి కష్టం మీద బడి చదువులు చదివారు.. ఓవైపు పార్ట్‌టైం ఉద్యోగాలతో డబ్బులు సంపాదిస్తూ కళాశాల చదువులు పూర్తి చేశాడు.. ఆ తర్వాత పల్లెసీమ నుంచి ప్రస్థానం మొదలు పెట్టి ప్రపంచ స్థాయికి ఎదిగాడు. అక్షరమే ఆయుధంగా మలిచి సమాజ శ్రేయస్సే లక్ష్యంగా తలచి ముందుకు సాగుతున్నాడు. దేశ, విదేశాల నుంచి అందుకున్న పురస్కారాల ద్వారా తన ఘనతను చాటుకున్నాడు. అతనే శంషాబాద్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆర్థిక శాస్త్రంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ రవీందర్‌రెడ్డి.

7



పల్లెసీమ నుంచి ప్రపంచ స్థాయికి..

- దేశంలోని అతిపెద్ద విద్యా శిబిరాలకు ఆహ్వానం
- ఎన్ఎస్ఎస్ ద్వారా విద్యార్థులతో సేవా కార్యక్రమాలు
- పుస్తకాలు, వ్యాసాల ద్వారా సమాజానికి సందేశాలు
- సింగపూర్ ద్వారా సేవా పురస్కారం
- కృషితో ఇంతింతై ఎదిగిన డాక్టర్ రవీందర్‌రెడ్డి

రవీందర్‌రెడ్డి రచించిన ఇండియన్ ఎకానమీ పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి (ఫైల్)



రాజీయే రాజమార్గం

- లోక్ అదాలత్‌లో 447 కేసుల పరిష్కారం
- డిస్ట్రిక్ట్ ప్రిన్సిపల్ అండ్ సెషన్స్ జడ్జి డాక్టర్ సున్నం శ్రీనివాస్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న న్యాయమూర్తి శ్రీనివాస్‌రెడ్డి

వికారాబాద్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): రాజీయే రాజమార్గమని, ఇరుపక్షాలు ఒక అవగాహనకు వచ్చి కేసులు పరిష్కరించుకుంటే విజయం సాధించినట్లేనని డిస్ట్రిక్ట్ ప్రిన్సిపల్ అండ్ సెషన్స్ జడ్జి డాక్టర్ సున్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శనివారం జిల్లా కోర్టు కాంప్లెక్స్ ఆవరణలో నిర్వహించిన లోక్ అదాలత్‌కు హాజరై మాట్లాడారు. రాజీ మార్గంలో కేసులను పరిష్కరించుకోవడంపై కక్షిదారులు దృష్టి సారించాలని కోరారు. ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని, న్యాయ సేవా అధికార సంస్థ అందించే ఉచిత సేవలను సద్వినియోగం చేసుకవాలని సూచించారు. వికారాబాద్, తాండూరు, పరిగి, కొడంగల్ కోర్టుల పరిధిలో నిర్వహించిన లోక్ అదాలత్‌లలో 447 కేసులు పరిష్కరించినట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అదనపు, సీనియర్, జూనియర్ జడ్జిలు, లోక్ అదాలత్ సభ్యులు, బార్ అసోసియేషన్ బాధ్యులు, తదితరులు పాల్గొన్నారు.



ధారూరు మెథడిస్టు జాతరలో ఏసు ప్రభువు శిలువ వద్ద ప్రార్థనలు చేస్తున్న భక్తులు

సందడిగా మెథడిస్టు జాతర

నేటితో ముగియనున్న ధారూరు ఉత్సవాలు

ధారూరు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ధారూరు మెథడిస్టు జాతర శనివారం క్రైస్తవ భక్తులతో సందడిగా కనిపించింది. భక్తులు కాలి నడకన, వాహనాలు, బస్సులు, రైళ్లలో పెద్ద ఎత్తున తరలివచ్చారు. ప్రార్థన షెడ్లలో దైవ సందేశాలు, పాటలు, కీర్తనలతో ఏసునామ స్మరణ మార్మోగింది. ప్రధాన వేదిక, ముఖ ద్వారం వద్ద భక్తులు కొవ్వొత్తులు వెలిగించి ప్రార్థనలు చేశారు. అనారోగ్యంతో ఉన్న వారికి, చిన్నారులకు పాస్టర్లు ఆశీర్వచనాలు అందజేశారు. భజన మండలి చేసిన భజనలు ఆకట్టుకున్నాయి. జాతరకు వచ్చిన భక్తులు గుడారాలు ఏర్పాటు చేసుకుని బస చేశారు. అయితే ఉత్సవాలు ఆదివారంతో ముగియనున్నాయి. చివరి రోజు భక్తులు పెద్ద ఎత్తున తరలిరానున్నారు. బిషప్‌లు, లే లీడర్లు హాజరవుతారని జాతర కమిటీ నిర్వాహకులు తెలిపారు.

వైద్య శిబిరాన్ని తనిఖీ చేసిన జిల్లా వైద్యాధికారి

మెథడిస్టు జాతరలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని జిల్లా వైద్యాధికారి స్వర్ణకుమారి తనిఖీ చేశారు. శిబిరంలో 24 గంటలు షిఫ్టుల వారీగా సిబ్బంది అందుబాటులో ఉండాలని ఆదేశించారు. అన్ని రకాల మందులను అందుబాటులో ఉంచుకోవాలని వైద్య సిబ్బందికి సూచించారు. అత్యవసర సమయంలో అవసరమైతే వినియోగించుకోవడానికి అంబులెన్సును అందుబాటులో ఉంచామని తెలిపారు.



ఘనంగా సహస్ర దీపోత్సవం

ఘట్‌కేసర్ మున్సిపాలిటీ ఎన్ఎఫ్‌సీ నగర్‌లోని శ్రీరామ కల్యాణ కామేశ్వరి నవ శక్తి ఆలయంలో కార్తీక మాస పూజల్లో భాగంగా శనివారం సహస్ర దీపోత్సవం నిర్వహించారు. మహిళలు పెద్ద ఎత్తున తరలి వచ్చి ఓం, స్వస్తిక్, శివలింగం ఆకారాల్లో దీపాలను వెలిగించారు. ఆలయంలో పూజారి శివకుమార్ శర్మ ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు బొక్క ప్రభాకర్‌రెడ్డి, ప్రసాద్, మూర్తి, వీరేశం, రాంచంద ర్‌రెడ్డి, కందకట్ల చెన్నారెడ్డి, అంజిరెడ్డి, సూరి పాల్గొన్నారు.

- ఘట్‌కేసర్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి)



సమస్యల ఈ - పంచాయతీ

- పోర్టల్‌లో కుటుంబంలో ఒక్కరికే వారసత్వం
- ఇంటి పన్ను తీసుకున్నా ధ్రువీకరించలేని కార్యదర్శి
- కూలిన ఇళ్లకు పన్నులు.. కూలని వాటికి జీరో ట్యాక్స్
- ఎంత స్థలమున్నా 999 గజాలే లెక్క
- పోర్టల్‌లో మార్పులు చేయాలని కోరుతున్న ప్రజలు



తాండూరు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ఈ - పంచాయతీ రాజ్ పోర్టల్‌లో మార్పులు, చేర్పులకు అవకాశం లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వారసత్వ హక్కులు, ఇంట్లో ఎంత మంది ఉన్నా ఒక్కరికే హక్కు, కూలిన ఇళ్లకు పన్నులు, కూలని వాటికి జీరో ట్యాక్స్ వంటి తప్పుల తడకతో ఉన్న పోర్టల్‌తో ప్రజలు అవస్థలు పడుతున్నారు.

కేరళ తరహాలో తీసుకొచ్చినా..

కేరళ రాష్ట్రం తరహాలో తెలంగాణలోనూ గ్రామాల్లో ఇళ్లు, ఆస్తుల వివరాలు ఒక పోర్టల్‌లో పొందుపర్చాలనే ఉద్దేశంతో పంచాయతీరాజ్ శాఖ ఈ పంచాయతీ పోర్టల్‌ను తీసుకువచ్చింది. 2021లో అప్పటి ప్రభుత్వం తీసుకువచ్చిన ఈ కొత్త విధానంలో అనేక లోసుగులు ఉన్నాయి. స్వమిత్వ పథకంతో కేంద్రం గ్రామాల్లో సొంత ఇళ్లు ఉన్న వారికి ఇంటి పట్టా పాసుబుక్ ఇచ్చే పథకాన్ని పైలెట్ ప్రాజెక్టు రాష్ట్రంలో అమలు చేయాలని చూసింది. అయితే కేంద్ర నిర్ణయానికి ముందే రాష్ట్ర ప్రభుత్వం ఏకంగా ఒక అధికార బృందాన్ని స్టడీ

మిగతా 8వ పేజీలో...

ఆస్తిపై వారసులకు హక్కు లేదు!

ఈ - పంచాయతీ కొత్త విధానం వల్ల ఇంటిని, స్థలాన్ని కలిగిన యజమాని మృతి చెందితే వారసత్వం యజమాని భార్యకు వర్తించేవిధంగా ఆప్షన్‌లో పొందుపర్చారు. భార్యాభర్తలు ఇద్దరు మృతి చెందితే వారి కుటుంబంలో ఎంత మంది సంతానం ఉన్నా ఒక్కరి పేరు మీదనే వారసత్వ మార్పిడి చేయనున్నారు. ఇంట్లో ఉన్న సోదరులు కలిసి ఎవరి పేరు సూచిస్తే వారి పేరుపై మార్పిడి జరిగి ఆస్తి పన్ను కూడా వారి పేరిటనే చెల్లించేవీలుంది. ఏమైనా తేడాలు వచ్చి తన పేరిట ఉన్న ఆస్తిన్ని అమ్ముకుంటే మీగతా సోదరులు ఏమి చేయలేని పరిస్థితి. ఇంటిని అన్నదమ్ములు భాగాలుగా చేసుకొని వారి పేర్లను మార్చుకునే అవకాశం లేదు.

కాలుష్యం.. పంటలు నాశనం

● కంపెనీకి రాకపోకలను అడ్డుకున్న రైతు



పూడూరు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): కాలుష్యంతో మా పంటలు నాషనమవుతున్నాయ్... కంపెనీకి రాకపోకలు సాగనివ్వనం అంటూ ఓ రైతు రోడ్డుకు అడ్డంగా కట్టెలు వేసిన అడ్డుకున్నాడు. పూడూరు మండలం మిర్జాపూర్ సమీపంలో సుందర్ కంపెనీ ఉంది. ఈ కంపెనీ ద్వారా నిత్యం కాలుష్యం వెదజల్లుతుండటంతో చుట్టుపక్కల ప్రాంతాల పంటలపై ప్రభావం పడుతోంది. దీంతో శనివారం ఓ రైతు ఆగ్రహానికి గురయ్యాడు. కాలుష్యం వల్ల తన పంట పూర్తిగా పాడవుతోందని ఊగిపోతూ కంపెనీకి రాకపోకలు జరుగకుండా రోడ్డుకు అడ్డంగా కట్టెలు వేశాడు. తమ పంటలు నాశనమై తాము నష్టపోతుంటే కంపెనీ యాజమాన్యం తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తోందని, అధికారులు కూడా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. కంపెనీ నుంచి వచ్చే కాలుష్యంతో పంటలు ఎలా పాడయ్యాయో ఒక్కసారి చూడాలంటూ ఆగ్రహించారు. రైతు కట్టెలు తీయనని భీష్మించడంతో పోలీసులు రంగప్రవేశం చేసి రైతుకు నచ్చజెప్పారు. కాలుష్యాన్ని నియంత్రించకుంటే పెద్ద ఎత్తున ఆందోళనకు దిగుతామంటూ రైతు హెచ్చరించాడు.



విజేతలుగా నిలిచిన వాలీబాల్ జట్టు

విద్యార్థులు క్రీడల్లోనూ ప్రతిభ చూపాలి

మేడ్చల్ టౌన్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ ప్రతిభ చూపాలని మేడ్చల్ ఏసీపీ శంకర్‌రెడ్డి అన్నారు. మేడ్చల్‌లోని కిష్టాపూర్ ఎంఆర్ఈఎం కళాశాలలో నిర్వహిస్తున్న జోనల్ స్థాయి వాలీబాల్ ఆటలపోటీలను ఆయన సందర్శించారు. విద్యార్థులనుద్దేశించి ఆయన మాట్లాడుతూ.. శారీరక దృఢత్వం కోసం క్రీడల్లో పాల్గొనాలని కోరారు. చదువుపై చూపిన శ్రద్ధ క్రీడలపైనా చూపాలన్నారు. రోజూ కనీసం రెండు గంటల పాటు క్రీడల్లో పాల్గొనాలన్నారు. క్రీడా నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు ఆటల పోటీలు దోహద పడతాయన్నారు. విద్యార్థులను క్రీడల్లో ప్రోత్సహించాలనే తమ కళాశాల జోనల్ స్థాయి ఆటల పోటీలను నిర్వహిస్తోందని ఎంఆర్ఈఎం కళాశాల చైర్మన్ వి.మల్లారెడ్డి అన్నారు. కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి కృష్ణారెడ్డి, వివిధ జిల్లాల వాలీబాల్ అసోసియేషన్ అధ్యక్షులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలి



వేంకటేశ్వరాలయంలో పూజలు చేసిన ఎమ్మెల్యే సబితారెడ్డి

మహేశ్వరం, నవంబరు 15(ఆంధ్రజ్యోతి):ప్రతీ ఒక్కరు ఆధ్యాత్మిక చింతనను అలవర్చుకోవాలని ఎమ్మెల్యే పి.సబితారెడ్డి అన్నారు. శనివారం అమీర్‌పేటలోని వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు జరిగాయి. ఈ బ్రహ్మోత్సవాలకు హాజరైన సబిత.. స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. సువిశాల ప్రదేశంలో ఉన్న ఈ వేంకటేశ్వర ఆలయానికి ఎంతో ప్రాధాన్యం ఉందన్నారు. ఆలయంలో ప్రతీ ఉక్కరు పూజలు చేయడంతో మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. కార్యక్రమంలో ఆయా పార్టీ నాయకులు తధితరులు పాల్గొన్నారు.

శివరామాంజనేయ ఆలయ వార్షికోత్సవం



ఆలయంలో గణపతి హోమం నిర్వహిస్తున్న వేదపండితులు

నందిగామ, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): నందిగామలోని శివరామంజనేయ ఆలయంలో వార్షికోత్సవ పూజలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో గణపతిపూజ, హోమం, శివపార్వతుల కల్యాణాన్ని వేదపండితులు నిర్వహించారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఈ పూజల్లో జడ్పీ మాజీ వైస్‌చైర్మన్ ఈటగణేష్, నాయకులు వెంకట్‌రెడ్డి, కొమ్ముక్రిష్ణ, చంద్రపాల్‌రెడ్డి, బాల్‌రెడ్డి, నర్సింలు, శ్రీకాంత్‌గౌడ్, సి.క్రిష్ణాగౌడ్, జంగయ్యగౌడ్, సత్తిరెడ్డి, పెంటయ్య, రాంరెడ్డి, నర్సింహ, నర్సింహారెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

● వీల్‌చైర్లు ఉన్నది ఇందుకా?



ప్రభుత్వ కార్యాలయాల్లో సిబ్బంది రోజురోజుకూ బద్ధకిస్తున్నారు. అధికారులు, సందర్శకులు కూర్చునేందుకు సమకూర్చిన వీల్‌చైర్లను సామగ్రి తరలింపునకు వాడుతున్నారు. రంగారెడ్డి కలెక్టరేట్‌లోని వీల్‌చైర్లలో శనివారం సామాన్లు తరలిస్తున్నారిలా..

- ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి ఫొటో గ్రాఫర్

క్రీడలకు ప్రాధాన్యమిస్తున్న ప్రభుత్వం



విద్యార్థులకు టీషర్టులను అందజేస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్ అర్బన్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి):తెలంగాణ ప్రభుత్వం విద్యతో పాటు క్రీడలకు ప్రాధాన్యమిస్తోందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తెలిపారు. ఫరూఖ్‌నగర్ మండల మాజీ జడ్పీటీసీ సభ్యుడు పి.వెంకట్‌రాంరెడ్డి ఆధ్వర్యంలో శనివారం రంగారెడ్డి జిల్లా నుంచి రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైన 80 మంది విద్యార్థులకు ఎమ్మెల్యే చేతుల మీదుగా టీ-షర్టులను పంపిణీ చేశారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే శంకర్ మాట్లాడుతూ తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరువాత విద్యకు అధిక ప్రాధాన్యతనిస్తూ విద్యా సంస్థలను నెలకొల్పుతూ, సమస్యలను పరిష్కరిస్తూ వస్తున్నామన్నారు. క్రీడాకారులను తయారు చేయాలని స్కూల్ గేమ్స్ ఫెడరేషన్‌ను ఏర్పాటు చేసి మండల, తాలుకా, జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో ఆటల పోటీలను నిర్వహిస్తున్నామని చెప్పారు. క్రీడాకారులకు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు లభిస్తుందన్నారు. క్రీడాకారులను ప్రోత్సహించేలా టీ-షర్టులను పంపిణీ చేస్తున్న పి.వెంకట్‌రాంరెడ్డిని, రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్‌కు ఎంపికైన జె.దేవిప్రియ, వి.విక్రమ్‌లను అభినందించారు. క్రీడాకారులకు ఎమ్మెల్యే నగదు బహుమతిని ఇచ్చారు. కార్యక్రమంలో ఎంఈవో మనోహర్, స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ జోనల్ సెక్రటరీ బాలయ్య, మాజీ సెక్రటరీ రాజశేఖర్‌రెడ్డి, పీడీలు రమేష్, శ్రీను పాల్గొన్నారు.

అదుపుతప్పి మినీ ట్రక్కు బోల్తా



నందిగామ బైపాస్ రోడ్డులో బోల్తాపడిన గూడ్స్ ట్రాలీ

నందిగామ, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): నందిగామ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఎమ్ఎస్ఎన్ పరిశ్రమ సమీపంలోని బైపాస్ రోడ్డుపై మినీ ట్రక్కు అదుపుతప్పి బోల్తా పడడంతో వ్యక్తికి తీవ్రగాయాలైన సంఘటన శనివారం చోటుచేసుకుంది. పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్‌లోని కాకినాడ నుంచి అశోక్‌లేలాండ్ మినీ ట్రక్కు కొబ్బరి కాయల లోడుతో మహబూబ్‌నగర్ వెళ్తుండగా మార్గమధ్యలో టైర్ పేలి నందిగామ సమీప జాతీయ రహదారిపై బోల్తాపడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాద సమయంలో ట్రక్కులో వ్యక్తికి సైతం స్వల్ప గాయాలయ్యాయి. వారిని చికిత్స నిమిత్తం షాద్‌నగర్ కమ్యూనిటీ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

తుది దశకు అంగడిరైచూర్ డబుల్ రోడ్డు పనులు

కొడంగల్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అంగడిరైచూర్ నుంచి చిట్లపల్లి మీదుగా బీజాపూర్ జాతీయ రహదారికి అనుసంధానంగా చేపట్టిన డబుల్ రోడ్డు పనులు తుది దశకు చేరుకున్నాయి. గతంలో సింగిల్ రోడ్డు కారణంగా తరచూ ప్రమాదాలు జరిగేవి. ఈ మార్గంలో డబుల్ రోడ్డు నిర్మాణంతో ఆయా గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. డబుల్ రోడ్డు నిర్మాణం పూర్తయితో రవాణా పరంగా సులభంగా ఉంటుందని ప్రజలు తెలిపారు.

విధుల్లో నిర్లక్ష్యం వద్దు



తుమ్మలపల్లిలో జీపీ రికార్డులను పరిశీలిస్తున్న డీపీవో సురేష్‌మోహన్

చౌదరిగూడ, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీలో చేపట్టే పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని జిల్లా పంచాయతీ అధికారి సురేష్ మోహన్ హెచ్చరించారు. శనివారం తుమ్మలపల్లిలో సగ్రిగేషన్ షెడ్, వైకుంఠధామం, నర్సరీని తనిఖీ చేశారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. శానిటేషన్ బాగలేకుంటే చర్యలు తప్పవని పంచాయతీ కార్యదర్శి సౌజన్యను హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్, ఎంపీవో హన్మంతరెడ్డి పాల్గొన్నారు.

జై భారత్‌మాత సేవా సమితికి ఎకరం విరాళం



తహసీల్దార్ కార్యాలయంలో రిజిష్టర్ డాక్యుమెంట్లపై సంతకాలు చేస్తున్న నిరగుడి మల్లినాథ్ మహరాజ్

తాండూరు రూరల్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): కర్ణాటక రాష్ట్రానికి చెందిన శ్రీ నిరగుడి హవా మల్లినాథ్ మహరాజ్ ట్రస్ట్‌కు రూ.లక్షలు విలువ చేసే ఎకరం భూమిని కరన్‌కోట్ భక్తులు విరాళం ఇచ్చారు. కరన్‌కోట్‌కు చెందిన అన్నదమ్ములు దరిమిది రవిశంకర్, దరిమిది బస్వరాజ్ గ్రామంలోని సర్వే నంబర్ 303లో ఉన్న ఎకరం భూమిని మహరాజ్ ట్రస్ట్‌కు తహసీల్దార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేసిచ్చారు. కరన్‌కోట్‌లో జై భారత్ మాత సేవా సమితి(ర) ఢిల్లీ పేరిట ఆశ్రమాన్ని ఏర్పాటు చేసి భక్తులకు సేవలు అందిస్తున్నట్లు మల్లినాథ్ మహరాజ్ పేర్కొన్నారు. ఆయన తహసీల్దార్ కార్యాలయానికి వస్తున్నారన్న సమాచారంతో భక్తులు పెద్ద సంఖ్యలో వచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. రిజిస్ట్రేషన్ అనంతరం తహసీల్దార్ తారాసింగ్, కంప్యూటర్ ఆపరేటర్ ప్రతాప్‌ను స్వామి శాలువాతో ఘనంగా సన్మానించారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద భక్తులకు ప్రసాదం అందజేశారు. కరన్‌కోట్‌లో త్వరలోనే ఆశ్రమాన్ని ఏర్పాటు చేసేందుకు జై భారత్‌మాత సేవా సమితి పేరిట ఆ స్థలంలో జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో తాండూరు సామాజిక సేవ సమితి ప్రతినిధి దరిమిది రవిశంకర్, పూజారి పాండు, చిట్టిగణాపూర్ ప్రభాకర్ రెడ్డి, మాజీ సర్పంచ్ కేశవరావు, రాకేష్, వెంకటేష్ పాల్గొన్నారు.

24న జాతీయ స్థాయి అస్మిత లీగ్ అథ్లెటిక్స్

అథ్లెటిక్స్ నిర్వహణ బ్రోచర్‌ను విడుదల చేస్తున్న జోన్స్, రాజశేఖర్ తదితరులు



శామీర్‌పేట, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని తూంకుంట పరిధిలో గల రాష్ట్ర స్పోర్ట్స్ స్కూల్ గ్రౌండ్స్‌లో ఈ నెల 24న స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా, ఏపీ ప్రభుత్వ అథ్లెటిక్స్ ఫెడరేషన్ సంయుక్త ఆధ్వర్యంలో జాతీయ స్థాయిలో అస్మిత లీగ్ టాలెంట్ ఐడెంటిఫికేషన్ అథ్లెటిక్స్ క్రీడా పోటీలను నిర్వహిస్తామని అథ్లెటిక్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ట్రెజరర్, తెలంగాణ అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షుడు స్టాండ్లీ జోన్స్, మేడ్చల్ జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ కూరపాటి రాజశేఖర్ తెలిపారు. శనివారం ఈ క్రీడాపోటీల బ్రోచర్‌ను విడుదల చేశారు. వారు మాట్లాడుతూ.. జాతీయ స్థాయి లీగ్ టాలెంట్ ఐడెంటిఫికేషన్ అథ్లెటిక్స్ పోటీలకు వివిధ రాష్ట్రాల్లోని 300 జిల్లాల నుంచి బాలికా క్రీడాకారులను ఎంపిక చేస్తామన్నారు. పోటీలను రాష్ట్రంలో నిర్వహించడం మనకు గర్వకారణం అన్నారు. ఈ అథ్లెటిక్స్‌లో ప్రతిభ చూపిన బాలికలను 2036 ఒలింపిక్స్‌కు ఎంపిక చేస్తామని వెల్లడించారు. ఈ నెల 24న మొదటి రోజు అండర్-14, 16 బాలికలకు రన్నింగ్, జంపింగ్, త్రోయింగ్, ట్రాయికలన్ ఈవెంట్స్ నిర్వహిస్తామని తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొనేందుకు తెలంగాణలోని వివిధ పాఠశాలల బాలికా క్రీడాకారుల పేర్లను రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని తెలిపారు. పాల్గొనదల్చిన క్రీడాకారులు బయోడేటా, అథ్లెటిక్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఇచ్చిన రిజిస్ట్రేషన్‌లో రిజిష్టరై ఉండాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర అథ్లెటిక్స్ అసోసియేషన్ బాధ్యులు అశోక్‌కుమార్, తిరుమలరావు, భద్రం పాల్గొన్నారు.

వైద్య వృత్తి గౌరవప్రదమైనది



విద్యార్థులకు చెక్కు అందజేస్తున్న చీఫ్ విప్ మహేందర్‌రెడ్డి

చేవెళ్ల, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): సమాజంలో వైద్య వృత్తికి ఎంతో గౌరవం ఉందని, అందుకుగాను వైద్యులు గ్రామీణ ప్రాంతాల్లోని పేదలకు వైద్యసేవలు అందించాలని ఎమ్మెల్సీ ప్రభుత్వ విప్ పట్నం మహేందర్‌రెడ్డి అన్నారు. శనివారం చేవెళ్లలోని పట్నం మహేందర్‌రెడ్డి మెడికల్ కళాశాలలో కొత్తగా ప్రవేశం పొందిన ఎంబీబీఎస్ విద్యార్థులకు ఓరియంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా మహేందర్‌రెడ్డి, విద్యావేత్త డైరెక్టర్ వరదారెడ్డిలు హాజరయ్యారు. మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ... విద్యార్థులు కష్టపడి చదివి ప్రజలకు వైద్యసేవలందించాలని సూచించారు. వైద్యులు దేవుడితో సమానం అన్నారు. తమ కళాశాలను దేశంలోనే ఆదర్శవంతమైన కాలేజీగా తీర్చిదిద్దేందుకు ముందుకుసాగుతున్నట్లు చెప్పారు. రానున్న రోజుల్లో మహేందర్‌రెడ్డి మెడికల్ కళాశాల యూనివర్సిటీగా మారబోతుందన్నారు. రోజూ 1,800 మంది ఓపీ వస్తున్నారని తెలిపారు. కళాశాలలో ఆధునాతన వైద్య పరికరాలు, మెరుగైన విద్యాబోధన, ప్రయోగశాలలు ఉన్నాయన్నారు. మెడికల్ కౌన్సిలింగ్ నుంచి బంగారు పతకం అందుకున్న విద్యార్థిని శివానిగౌడ్‌కు రూ.లక్ష, సునీల్‌కు రూ.75వేలు, మహమ్మద్ అజ్మీర్‌కు రూ.50వేలు, ముసైబాకు రూ.25వేల చెక్కులను మహేందర్‌రెడ్డి అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జోయారాణి, మెడికల్ సూపరింటెండెంట్ రామకృష్ణారెడ్డి, అకడమిక్ డైరెక్టర్ గౌరి, వైస్‌ప్రిన్సిపాల్ రాజేశ్వర్‌రావు,జీఎం నగేశ్, ఏజీఎం రవివర్మ, సీఈవో అజీమ్, అధ్యాపకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఓంకారేశ్వరుడికి ప్రత్యేక పూజలు



పూజలు చేస్తున్న మఠాధిపతి చెన్న బసవ ప్రభు

చౌడాపూర్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మందిపాల్ ఓంకారేశ్వరస్వామి ఆలయంలో శనివారం ప్రత్యే క పూజలు చేశారు. శ్రీమాన్ నిరంజన ప్రణవ స్వరూప, ఆలంపల్లికి చెందిన మఠాధిపతి డాక్టర్ చెన్న బసవప్రభు ఆధ్వర్యంలో భక్తులు కార్తీక దీపాలు వెలిగించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు మఠం రాజశేఖర్ పాల్గొన్నారు.

గ్రామాల్లో ఇప్పటికీ కుల వివక్షా?

ఇబ్రహీంపట్నం, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో అక్కడక్కడ ఇంకా కుల వివక్ష కొనసాగుతుందని కుల అసమానతల నిర్మూలన పోరాట సమితి ఆందోళన వ్యక్తం చేసింది. శనివారం ఇబ్రహీంపట్నం మండలం రాయపోల్‌లో సంఘం జిల్లా అధ్యక్షురాలు జి.సరోజన, కోశాధికారి మోహనకృష్ణ, రాష్ట్ర కమిటీ సభ్యుడు చక్రవర్తి మాట్లాడుతూ.. రాయపోల్‌లో కొందరు అయ్యప్ప స్వాములు వివక్ష చూపుతున్నారని ఆరోపించారు. అయ్యప్ప మాలలో ఉన్న వారు కూడా వివక్ష చూపడం మంచిది కాదన్నారు. ఓ అయ్యప్ప సన్నిధానం వద్ద ఈ వివక్ష చూపుతున్నట్లు తమ దృష్టికి రావడంతో గ్రామంలో పర్యటించి తెలుసుకున్నామన్నారు. హిందువులమని చెప్పుకునే వారు హిందువులపైనే వివక్ష చపుతున్నారన్నారు. ఈ విషయమై అధికారులు స్పందించాలని వారు డిమాండ్ చేశారు.

భక్తి శ్రద్ధలతో కోటి దీపోత్సవం

● తరలి వచ్చిన మహిళలు

షాద్‌నగర్ రూరల్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): షాద్‌నగర్ పట్టణంలో నిర్వహించిన కార్తిక మాసం కోటి దీపోత్సవ కార్యక్రమాన్ని శనివారం రాత్రి అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఛత్రపతి శివాజీ కల్చలర్ యూత్ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు నిర్వహిస్తున్న కోటి దీపోత్సవంలో మహిళలు అధిక సంఖ్యలో హాజరై దీపాలు వెలిగించారు. దీపోత్సవ పరిసరాలు శివనామ స్మరణతో మార్మోగాయి. భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. దీపాలు వెలిగించి మొక్కుకున్నారు. సింగారం శ్రీనివాస్, యాదగిరి నివాస్ ఆధ్వర్యంలో జరిగిన దీపోత్సవానికి స్థానికులు తరలివచ్చారు. పంచామృతాభిషేకాలు చేశారు. శివుడి స్తోత్రాలు పఠించారు.



శివలింగాలకు పూజలు చేస్తున్న భక్తులు



◄ కార్తీక దీపాలు వెలిగిస్తున్న మహిళలు

కీసరగుట్టలో కార్తీక సందడి

కీసర రూరల్, నవంబర్ 15(ఆంధ్రజ్యోతి): కార్తీక శనివారం సందర్భంగా కీసరగుట్టకు భక్తులు పోటెత్తారు. తెల్లవారుజాము నుంచే ఆలయం వద్ద భక్తుల రద్దీ నెలకొంది. ములవిరాట్ శ్రీరామలింగేశ్వర స్వామిని పంచామృతాలతో అభిషేకించి పూజలు చేశారు. ఆలయ ప్రాంగణంలోని శివలింగాలను పాలతో అభిషేకించారు. భక్తులు దీపాలను వెలింగించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. కీసరగుట్టలోని హండా పార్కులో పలువురు కార్తీక వన భోజనాలు చేశారు.



ప్రతి అక్షరం.. సమాజానికి అంకితం

షాద్‌నగర్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): షాద్‌నగర్ నియోజకవర్గం ఫరూఖ్‌నగర్ మండలం మొగిలిగిద్ద పరిధి రంగధాముల గ్రామానికి చెందిన గోపాల్ రెడ్డి, కిష్టమ్మ దంపతుల కుమారుడు రవీందర్‌రెడ్డి. చిన్నతనంలోనే అతడి తండ్రి చనిపోగా తల్లి వ్యవసాయ పనులుచేస్తూ కొడుకును చదివించింది. మొగిలిగిద్ద పాఠశాలలో 10వ తరగతి పూర్తిచేసిన ఆయన, షాద్‌నగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ పూర్తి చేశారు. ఆ తర్వాత ఉమ్మడి పాలమూరు జిల్లాజడ్చర్లలోని అంబేడ్కర్ డిగ్రీ కళాశాలలో బీఏ ఎకనామిక్స్ అదే సబ్జెక్టులో పీజీ కూడా పూర్తిచేశారు. అనంతరం ఉస్మానియా యూనివర్సిటీ నుంచి బీఈడీ చేసి ఆ తర్వాత ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ఎంఈడీ చేశారు. చదువు పట్ల ఉన్న ఆసక్తితో కాకతీయ విశ్వవిద్యాలయం నిర్వహించిన పీహెచ్‌డీ ప్రవేశ పరీక్షలో ఐదో ర్యాంకు సాధించాడు. కొంత కాలం వివిధ ప్రైవేటు కళాశాలల్లో అధ్యాపకుడిగా పనిచేసి, 2006లో నిర్వహించిన డీఎస్సీ ద్వారా స్కూల్ అసిస్టెంట్ ఉద్యోగం సాధించారు.

ఇది క్రాంతి పథం..

ఒకవైపు స్కూల్ అసిస్టెంట్‌గా ఉద్యోగం చేస్తూనే అప్పటి మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టర్ పురుషోత్తం ఆదేశాల మేరకు స్థానిక ప్రభుత్వ డైట్ కళాశాలలో డిప్యుటేషన్‌పై సైకాలజీ సోషల్ మెథడాలజీ లెక్చరర్‌గా పనిచేశారు. ఆ కాలేజీ విద్యార్థులకు ఉద్యోగాలు రావడానికి కారణమయ్యారు. తర్వాత ఎస్సీఈఆర్టీకి డిప్యూటేషన్‌పై వెళ్లి అక్కడ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థుల కోసం పుస్తకాలను రాశారు. 2012లో లెక్చరర్‌ల ఫలితాల్లో ఉమ్మడి రాష్ట్రంలో రెండో ర్యాంకు సాధించి ఆరో జోన్ టాపర్‌గా నిలిచి అర్థిక శాస్త్ర లెక్చరర్ ఉద్యోగాన్ని పొందాడు. ఆ తర్వాత ప్రమోషన్‌పై శంషాబాద్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తూనే సామాజిక సేవా కార్యక్రమాలు చేపడుతున్నారు. విద్యారంగానికి రవీందర్‌రెడ్డి చేస్తున్న కృషిని గమనించి హిమాచల్‌ప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ఆయనను అక్కడికి ఆహ్వానించింది. విద్యారంగం, పరిశోధన రంగాలకు సంబంధించి జాతీయ స్థాయిలో జరిగిన ఆరు వేదికలపైన తాను రచించిన పరిశోధనాపత్రాలను, అలాగే అంతర్జాతీయ స్థాయిలో జరిగిన మూడు వేదికల్లో ప్రశంసా పత్రాలను అందజేయడం విశేషం.



సింగపూర్ ఎస్‌యూఎస్‌ఎస్ యూనివర్సిటీ ప్రతినిధులతో రవీందర్‌రెడ్డి(ఫైల్)

విద్యా రచనల్లో మేటి..

పోటీ పరీక్షలు రాసే అభ్యర్థులు సులువుగా ఉద్యోగాలు సాధించేందుకు ఎన్నో పుస్తకాలను రాశారు. అలాగే భారతదేశానికి సంబంధించి ఇండియన్ ఎకానమీ పుస్తకాన్ని రచించి సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ఆవిష్కరింపజేశారు. ఆయన రచించిన పుస్తకంలో దేశ ఆర్థిక వ్యవస్థ, అభివృద్ధి, తీసుకోవాల్సిన చర్యలపై రవీందర్‌రెడ్డి పొందుపర్చారు. ఈ క్రమంలోనే ఢిల్లీలో జరిగే ఆసియా ఖండ విద్యావేత్తల సమావేశంలో పాల్గొనాలని రవీందర్‌రెడ్డి ఆహ్వానమందడం రాష్ట్రానికి గర్వకారణంగా నిలిచింది.

ధారూరు మెథడిస్టు జాతరలో గ్యాంబ్లింగ్

● గేమ్ ఆడి నిలువుదోపిడీకి గురైన భక్తులు
● తిరుగు ప్రయాణానికి డబ్బుల్లేక సెల్‌ఫోన్లు అమ్ముకున్న బాధితులు
● ఫిర్యాదు చేసినా పట్టించుకోని పోలీసులు
● ప్రశ్నించిన వారిపై గ్యాంబ్లర్ల దౌర్జన్యం

ధారూరు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ధారూరు మండలం దోర్నాల్ కాగ్నా నది పక్కన కొనసాగుతున్న ధారూరు మెథడిస్టు జాతరలో శనివారం గ్యాంబ్లింగ్ గేమ్ బహిరంగంగానే కొనసాగింది. ఈ జూదం ఆడినవారు డబ్బులు పోగొట్టుకుని నిలువుదోపిడీకి గురయ్యారు. పోలీసు పహారా మధ్య సాగుతున్న ఈ జాతరలో కళ్లముం దే గ్యాంబ్లింగ్ గేమ్ నిర్వహిస్తున్నా పట్టించుకునే నాథుడు లేకుండాపోయాడు. పోలీసుల అండదండతోనే ఈ గేమ్‌ను ఆడిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. ఆధ్యాత్మిక జాతరలో



మెథడిస్టు జాతరలో గ్యాంబ్లింగ్ గేమ్



ఇలాంటి జూద క్రీడపై పోలీసులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని భక్తులు ప్రశ్నిస్తున్నారు. శుక్రవారం నుంచి జాతరలో టేబుళ్లు వేసి ఈ గేమ్‌లను ఆడిస్తున్నారు. ఈ గేమ్ ఆడి డబ్బులు పోగొట్టుకున్న వారు తిరుగు ప్రయాణానికి డబ్బుల్లేక తమ సెల్‌ఫోన్లు విక్రయించుకుంటున్నారు. గ్యాంబ్లింగ్ గేమ్ గురించి అక్కడే విధుల్లో ఉన్న పోలీసు అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందించక ఫ్రాడ్ గేమ్ యథేచ్ఛగా కొనసాగింది.

లక్షలాది రూపాయల వ్యాపారం

జాతరలో ఆడిస్తున్న గ్యాంబ్లింగ్ గేమ్‌లో నిర్వాహకులు లక్షలాది రూపాయలు సంపాదించారు. రూ.500 నుంచి వేలల్లో డబ్బు పెట్టి ఆశతో ఆడిన చాలా మంది డబ్బు పోగొట్టుకున్నారు. సంతోషంగా జాతరకు వచ్చిన వారు భారీగా డబ్బులు పోగొట్టుకొని విచారంగా ఇళ్లకు వెళ్లిపోయారు. ఈ గేమ్ ఆడిస్తున్న చోట రక్షణగా కొందరు కర్రలతో తిరుగుతూ గేమ్ నిలపాలని ప్రశ్నించిన వారిపై దౌర్జన్యం చేశారు.

విస్ఫోట్ కవచ్-9లో పారామిలటరీకి తృతీయ స్థానం



విస్ఫోట్ కవచ్‌లో బహుమతి పొందిన సీఐఎస్ఎఫ్ బృందం

శంషాబాద్ రూరల్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): రాజస్థాన్ మానేసర్‌లో జరిగిన విస్ఫోట్ కవచ్-9(బాంబు విస్ఫోటాలను కనిపెట్టేందుకు నిర్వహించిన జాగిలాల) పోటీల్లో పాల్గొన్న శంషాబాద్ ఎయిర్‌పోర్టు పారామిలటరీ దళానికి తృతీయ స్థానం దక్కింది. బీఎస్ఎఫ్, సీఆర్‌పీఎఫ్, ఎస్ఎస్‌బీ, సీఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో శనివారం కవచ్ పోటీలు జరిగాయి. ఇందులో 16 రాష్ట్రాల నుంచి 23 టీంలు, ఢిల్లీ, చండీఘర్, జమ్మూ కశ్మీర్ టెర్రటరీలు పాల్గొన్నాయి. కర్ణాటక పోలీసులకు మొదటి స్థానం, ఆంధ్రప్రదేశ్ ఆక్టోపస్‌కు ద్వితీయ స్థానం, శంషాబాద్ ఎయిర్‌పోర్టు సీఐఎస్ఎఫ్‌కు తృతీయ స్థానం దక్కాయి. బహుమతులను సందీప్ మన్‌హస్ డీసీ అందజేశారు.

ఫ్లైట్‌లో స్మోకింగ్.. ప్రయాణికుడిపై కేసు

శంషాబాద్ రూరల్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): రియాద్ నుంచి శంషాబాద్ ఎయిర్ పోర్టుకు వస్తున్న 6ఈ 94 ఇండిగో విమానంలో సయ్యద్ అంజర్ అలీ అనే ప్రయాణికుడు పొగ తాగాడు. గమనించిన విమాన సిబ్బంది విమానంలో స్మోకింగ్ చేయొద్దని ప్రయాణికుడికి చెప్పినా వినలేదు. దీంతో విమాన సిబ్బంది పైలట్‌కు తెలిపారు. విమానం శనివారం ఉదయం 8 గంటలకు శంషాబాద్ ఎయిర్‌పోర్టులో ల్యాండ్ కాగానే పైలట్ ఆర్జీఐఏ ఔట్‌పోస్టు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. అయితే విమానంలో పొగ తాగొద్దనే విషయం తనకు తెలియదని ప్రయాణికుడు వాపోయినట్లు తెలుస్తోంది. గత వారం రోజుల్లో స్మోకింగ్ విషయమై ఇది రెండో ఘటన. కొన్ని రోజుల కింద కూడా దుబాయ్ నుంచి వచ్చిన ఓ ప్రయాణికుడు విమానంలో స్మోక్ చేయడంతో అతడిపై కేసు నమోదైంది.

జాతీయ స్థాయి శిబిరానికి సికిందర్



కొడంగల్ రూరల్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): ఎన్ఎస్ఎస్ జాతీయ స్థాయి సాహస శిబిరానికి కొడంగల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థి ఎంపికైనట్టు ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి శనివారం తెలిపారు. బీఏ ఫస్టియర్ విద్యార్థి వి.సికిందర్ ఈ నెల 18 నుంచి 27వ తేదీ వరకు హిమాచల్ ప్రదేశ్‌లోని ధర్మశాలలో జరిగే ఎన్ఎస్ఎస్ శిబిరంలో పాల్గొంటాడని చెప్పారు. భారత యువజన వ్యవహారాలు, అటల్ బిహారి వాజ్‌పేయి పర్వతా రోహణ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ సాహస శిబిరానికి తమ విద్యార్థి ఎంపిక కావడం హర్షణీయమన్నారు. ట్రెక్కింగ్, రాక్ క్లైంబింగ్, రాపెల్లింగ్, వాటర్ స్పోర్ట్స్, యోగా, శారీరక శిక్షణ, సాంస్కృతిక, పర్యావరణంపై అవగాహన వంటి కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. ఈ సందర్భంగా ఎంపికైన విద్యార్థిని ప్రిన్సిపాల్, సిబ్బంది అభినందించారు.

వందేళ్లుగా గిరిజనులను ఆదుకుంటోంది కాంగ్రెస్సే

మహేశ్వరం, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో తండాలు అభివృద్ధికి నోచుకోలేదని, ఆ పార్టీ గిరిజనుల ఓటు బ్యాంకు కోసమే తండాలను పంచాయతీలుగా చేసిందే తప్ప అభివృద్ధిని గత ప్రభుత్వం పట్టించుకోలేదని మాజీ ఎమ్మెల్యే, మహేశ్వరం కాంగ్రెస్ ఇన్‌చార్జి కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి అన్నారు. శనివారం మండల పరిధిలోని ఎన్డీతండాల్లో పంచాయతీ భవన నిర్మాణానికి చేసిన శంకుస్థాపనలో ఆయన పాల్గొని మాట్లాడారు. గత వంద సంవత్సరాల నుంచి గిరిజనులను అన్ని విధాలా ఆదుకున్నది కేవలం కాంగ్రెస్ మాత్రమే అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం తండాలకు రోడ్లు కూడా సరిగా వేయలేదన్నారు. ఇకపై ఒక్క ఎన్డీ తండానే కాకుండా మహేశ్వరం నియోజకవర్గంలో ఉన్న ప్రతీ తండాను అన్ని విధాలా అభివృద్ధి చేస్తామన్నారు. రానున్న స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ మద్దతుదారులను గెలిపించుకోవాలని ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో నాయకులు ఏనుగు జంగారెడ్డి, అంద్యానాయక్, గోపాల్ పాల్గొన్నారు.



ఎన్డీ తండాలో నూతన జీపీ భవన నిర్మాణ భూమి పూజలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్ ◄

పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు



ఇందిరమ్మ ఇంటిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

ఆమనగల్లు, నవంబరు 15(ఆంధ్రజ్యోతి):అర్హులైన పేదలందరికీ కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తుందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. ఇళ్ల కోసం పేదలు పదేళ్లుగా ఎదురు చూశారని, వారి కలలను కాంగ్రెస్ ప్రభుత్వం సాకారం చేస్తోందన్నారు. ఆమనగల్లు, కడ్తాల్, కల్వకుర్తి మండలాల్లో శనివారం ఎమ్మెల్యే నారాయణరెడ్డి పర్యటించి పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఎల్లికట్టలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను నాయకులతో కలిసి కసిరెడ్డి ప్రారంభించారు. అలాగే ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ప్రజల ఆకాంక్షలకనుగుణంగా పనిచేస్తుందన్నారు. ప్రతీ పేద కుటుంబానికి మేలు జరుగాలన్నదే సీఎం రేవంత్‌రెడ్డి ధ్యేయం అన్నారు. విడతల వారీగా పేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు కట్టిస్తామన్నారు. ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు, సన్న బియ్యం తదితర పథకాలతో ప్రజలు ఆనందంగా జీవిస్తుంటే.. విపక్షాలు ఓర్వలేక విషప్రచారం సాగిస్తున్నాయన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి తోడ్పాటుతో కల్వకుర్తి నియోజకవర్గం వేగవంతంగా అభివృద్ధి చెందుతోందన్నారు. నియోజకవర్గంలో రూ.వెయ్యి కోట్లతో రోడ్లను ఆధునికీకరిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. వర్షాలకు దెబ్బతిన్న రోడ్లు, చెరువు కుంటలకు మరమ్మతులు చేయిస్తామని నారాయణరెడ్డి తెలిపారు. తుఫాన్‌కు పంటలు నష్టపోయిన రైతులకు ప్రభుత్వం పరిహారం అందిస్తుందని ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో పీసీసీ అధికార ప్రతినిధి బాలాజీసింగ్, ఎంపీడీవో వెంకట్రాములు, నాయకులు భృంగి ఆనంద్ కుమార్, విజయ్‌కుమార్‌రెడ్డి, అశోక్‌రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, పర్వతరెడ్డి, సురేందర్‌రెడ్డి ఉన్నారు.



విజేతలకు బహుమతులు అందజేసున్న అధికారులు, ప్రిన్సిపాల్

ముగిసిన జిల్లా స్థాయి క్రీడా పోటీలు

శంషాబాద్ రూరల్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని పాలమాకుల మహాత్మా జ్యోతిబా పూలే పాఠశాల ఆవరణలో జరిగిన అండర్-14, అండర్-19 జిల్లా క్రీడా పోటీలు శనివారం ముగిసినట్లు ప్రిన్సిపాల్, క్రీడల జిల్లా కన్వీనర్ అనిత తెలిపారు. ముగింపు పోటీలకు ముఖ్య అతిథిగా ఓఎస్డీ(స్పోర్ట్స్) శ్రీనివాస్, రంగారెడ్డి జిల్లా ఆర్‌సీవో రాజేశ్‌కుమార్ హాజరయ్యారు. అండర్ 14 వాలీబాల్ పోటీలో మొదటి స్థానం మొగిలిగిద్ద, ద్వితీయ స్థానంలో పాలమాకుల టీంలు నిలిచాయి. కబడ్డీలో మొదటి స్థానం ఘట్‌కేసర్, ద్వితీయ స్థానం షాబాద్ సాధించాయి.చెస్‌లో మొదటి స్థానం కుత్బుల్లాపూర్, ద్వితీయ స్థానం మల్కాజ్‌గిరి కైవసం చేసుకున్నాయి. అండర్-19 వాలీబాల్‌లో మొదటి స్థానంలో షాబాద్, ద్వితీయ స్థానం యాచారం, కబడ్డీలో మొదటి స్థానం షాబాద్, ద్వితీయ స్థానం పాలమాకుల, టెన్నికాయిట్‌లో మొదటి స్థానం పాలమాకుల, ద్వితీయ స్థానం యాచారం, చెస్‌లో మొదటి స్థానంలో యాచారం, ద్వితీయస్థానం షాబాద్ కైవసం చేసుకున్నాయి. కార్యక్రమంలో మార్కెటింగ్ ఆఫీసర్ ఆఫ్ పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్ శివాజీ రాజ్, ప్రిన్సిపాల్ అనిత తదితరులు పాల్గొన్నారు.

కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

ఘట్‌కేసర్ రూరల్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని అనురాగ్ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ అర్చన మంత్రి, సీఈవో సూర్యదేవర నీలిమ అన్నారు. పోచారం పరిధి వెంకటాపూర్ అనురాగ్ యూనివర్సిటీలో శనివారం నిర్వహించిన బాలోత్సవ్-2025 కార్యక్రమానికి వారు ముఖ్య అతితిగా హాజరై సాంస్కృతిక కార్యక్రమాలను ప్రారంభించారు. 20కిపైగా ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల నుంచి 600మంది విద్యార్థులు ఈ బాలోత్సవ్‌లో పాల్గొని సాంస్కృతిక, సాహిత్య, జానపద కళా ప్రదర్శనలు ఇచ్చారు. ఈ సందర్భంగా వీసీ, సీఈవోలు మాట్లాడుతూ... విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి కృషిచేయాలన్నారు. జీవితంలో క్రమశిక్షణ, పట్టుదల, సమయపాలన చాలా ముఖ్యమని సూచించారు. చదువుతో పాటు సాంస్కృతిక, సాహిత్య, జానపద రంగాల్లో రాణించాలన్నారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు జ్ఞాపికలు అందజేశారు. జానపద రంగంలో ఎదులాబాద్ జెడ్పీ బాలికల పాఠశాల విద్యార్థినులకు మొదటి బహుమతి లభించింది. కార్యక్రమంలో ఇంగ్లీష్ హెచ్‌వోడీ అనంతలక్ష్మి, పీడీ తారాసింగ్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అఫీసర్ మల్లేష్, అధ్యాపకులు పాల్గొన్నారు.



బాలోత్సవ్‌లో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు, వీసీ అర్చన, సీఈవో నీలిమ

రాజీతోనే కేసుల సత్వర పరిష్కారం



పరిగి కోర్టులో కేసులను పరిష్కరిస్తున్న న్యాయాధికారి నాగుల శిల్ప

పరిగి,నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): కేసుల్లోని ఇరుపక్షాలు రాజీపడితే కేసులను సత్వరమే పరిష్కారమవుతాయని పరిగి మున్సిఫ్ కోర్టు న్యాయాధికారి నాగుల శిల్ప అన్నారు. పరిగి కోర్టులో శనివారం స్పెషల్ లోక్అదాలత్ నిర్వహించి కేసులను పరిష్కరించారు. ఈ సందర్భంగా న్యాయాధికారిణి మాట్లాడుతూ.. కేసుల్లో ఇరుక్కుని ఏళ్ల తరబడి కోర్టుల చుట్టూ తిరిగి సమయాన్ని వృథా చేసుకోరాదని సూచించారు. క్షణికావేశంలో గొడవలు పడి కేసుల్లో ఇరుక్కోకూడదని సూచించారు. సమస్యలేవైనా సామరస్యపూర్వకంగా పరిష్కరించుకోవాలన్నారు. కక్షలు పెంచుకోవడం ద్వారా నష్టమే తప్పా, లాభం ఉండదన్నారు. ఈ కార్యక్రమంలో పరిగి డీఎస్పీ శ్రీనివాస్, సమీనాబేగం, బాలముకుందం, ఇబ్రహింఖాన్ పాల్గొన్నారు. ఈ లోక్అదాలత్లో 177 కేసులను పరిష్కరించారు. వాటిలో సివిల్ ఒకటి, ఎక్సైజ్ నాలుగు, కాంప్రమైజ్ కేసులు 25, అడ్మిషన్ 16, ఎస్టీసీ ఒకటి, ఎంసీ ఒకటి, డ్రంక్ అండ్ డ్రైవ్ 129 కేసులను పరిష్కరించినట్లు తెలిపారు.

శామీర్పేట: అపరిష్కృతంగా ఉన్న కేసులను లోక్ అదాలత్(ప్రత్యేక ప్రజా న్యాయస్థానం)లో ప్రజలు పరిష్కరించుకోవచ్చునని పోలీస్ ఇన్స్పెక్టర్ గురువయ్య తెలిపారు. అలియాబాద్ మున్సిపల్ పరిధిలోని తుర్కపల్లి జీనోమ్వ్యాలీ పోలీస్ ఇన్స్పెక్టర్ గురువయ్య శనివారం మీడియాకు వెల్లడించారు. ఈనెల 15 నుంచి మేడ్చల్ కోర్టులో లోక్ అదాలత్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన వివరించారు. ప్రజలు వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు.

రోడ్డు అధ్వానం.. ప్రజాగ్రహం

- జేసీబీతో రోడ్డును తవ్వేసి నిరసన
- వెంటనే మరమ్మతులు చేపట్టాలని డిమాండ్
- ఎమ్మెల్యే హామీతో ధర్నా విరమణ



తాండూరు పట్టణంలో రోడ్డుపై నిరసన తెలుపుతున్న కాలనీ వాసులు

తాండూరు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): తాండూరు పట్టణం రాయల్ కాంట వద్ద కలిగిన కాలనీలో కొన్నేళ్లుగా సీసీ రోడ్డు గుంతలుగా ఏర్పడి అధ్వానస్థితిలో ఉంది. ఈరోడ్డు ప్రమాదంలో రాకపోకలు కూడా అధికంగా జరుగుతాయి. ఈరోడ్డు మార్గంలో మసీద్ ఉండటంతో ముస్లిం మైనార్టీలు కూడా పెద్దఎత్తున ప్రార్థన కోసం అక్కడికి వెళ్తుంటారు. ఈ రోడ్డును వేయకుండా అధికారులు, పాలకులు నిర్లక్ష్యం వహి



జేసీబీతో గుంతలరోడ్డును తవ్విస్తున్న కాలనీవాసులు

స్తున్నారని కాలనీ వాసులు రోడ్డుపైకి వచ్చి నిరసన తెలిపారు. ఆగ్రహంతో జేసీబీ ద్వారా ఉన్న రోడ్డును కూడా తవ్వేశారు. రోడ్డు మధ్యలో బైఠాయించి నిరసన తెలిపారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే మనోహర్రెడ్డి స్థానిక మాజీ కౌన్సిలర్ నర్సిములు, మున్సిపల్ కమిషనర్ యాదగిరి, అధికారులను తక్షణమే అక్కడికి పంపించి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. గంట తర్వాత హామీతో నిరసనకారులు ధర్నాను విరమించారు. స్థానిక మాజీ కౌన్సిలర్ నర్సిములు ఎమ్మెల్యే మనోహర్రెడ్డిని ఫోన్లో కాలనీవాసులతో మాట్లాడించారు. నెలరోజుల్లో రోడ్డును వేయిస్తామని హామీ ఇచ్చారు.

క్రైం కార్నర్

బాలిక అదృశ్యం

ఘట్కేసర్ రూరల్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): బాలిక అదృశ్యమైన ఘటన పోచారం ఐటీ కారిడార్ పోలీస్స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోచారం మున్సిపాలిటీకి చెందిన బాలిక(15) శనివారం ఉదయం ఇంట్లో చెప్పి బయటకు వెళ్లి తిరిగిరాలేదు. దీంతో ఆమె కుటుంబసభ్యులు తెలిసిన వారిని, మిత్రులను, బంధువులను ఆరా తీసినా ఫలితం లేకపోవడంతో సాయంత్రం పోలీసులను ఆశ్రయించారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోచారం ఐటీ కారిడార్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పేకాడుతున్న ఐదుగురిపై కేసు

యాలాల, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): పేకాట ఆడుతున్న వ్యక్తులను పట్టుకున్నట్లు యాలాల పోలీసులు తెలిపారు. యాలాల మండల పరిధిలోని పగిడిపల్లి గ్రామంలో శుక్రవారం రాత్రి 11గంటల సమయంలో పేకాడుతున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. నమ్మదగిన సమాచారం మేరకు అక్కడికి చేరుకున్న పోలీసులు అక్కడ పేకాడుతున్న ఐదుగురు వ్యక్తులు పిల్లికండ్ల రాములు, అష్తగిరి పవన్కుమార్, ఎర్ర పకీరప్ప, కొండి వెంకటేష్, కొండి ఏసులను పట్టుకున్నారు. వారి నుంచి రూ.5వేల నగదు, పేక ముక్కలను సీజ్ చేసి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ మేరకు ఐదుగురి కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

పాఠకులకు తగిన సౌకర్యాలు కల్పిస్తాం



పుస్తక ప్రదర్శనలో శ్రీనివాస్రెడ్డి

మేడ్చల్ టౌన్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): గ్రంథాలయానికి విచ్చేసే పాఠకులకు తగిన సౌకర్యాలు కల్పిస్తామని మేడ్చల్ జిల్లా గ్రంథాలయ చైర్మన్ శ్రీనివాస్రెడ్డి అన్నారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా శనివారం మేడ్చల్లో గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన నిర్వహించారు.ప్రశాంత వాతావర్ణంలో పాఠకులు చదువుకునే వీలు కల్పిస్తున్నామన్నారు. పాఠకుల అభిరుచికి అనుగుణంగా పుస్తకాలను గ్రంథాలయంలో సమకూరుస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ అరుంధతి తదితరులు పాల్గొన్నారు.

రైతులకు ఇబ్బంది కలగకుండా చర్యలు



స్పీకర్కు స్వీట్ తినిపిస్తున్న మార్కెట్ కమిటీ చైర్మన్

వికారాబాద్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): మార్కెట్ అభివృద్ధికి కృషి చేసి రైతులకు ఇబ్బంది కలుగకుండా చర్యలు తీసుకుంటానని మార్కెట్ కమిటీ చైర్మన్ చాపల శ్రీనివాస్ అన్నారు. వికారాబాద్ నాయకులతో కలిసి శనివారం స్పీకర్ నివాసానికి వెళ్లి పదవి ఇచ్చినందుకు కృతజ్ఞతలు తెలిపి పుష్పగుచ్ఛం అందజేసి స్వీట్ తినిపించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు సుధాకర్రెడ్డి, ఆర్టీఏ మెంబర్ ఎర్రవల్లి జాఫర్, నాయకులు రఘుపతిరెడ్డి, వైస్చైర్మన్ మల్లేశం, శివయ్య, కరుణాకర్రెడ్డి ప్రవీణ్, విజయ్కుమార్ పాల్గొన్నారు.

ఘనంగా భగవాన్ బిర్సాముండా జయంతి

పూడూరు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తిరుమలాపూర్లో భగవాన్ బిర్సాముండా 150వ జయంతి సందర్భంగా జనజాతీయ గౌరవ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని పంచాయతీ కార్యాలయం వద్ద శనివారం బిర్సాముండా చిత్రపటాన్ని ఏర్పాటు చేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ విజయ్కుమార్, ఎంపీడీవో, ఎంఈవో, ఎస్టీ హాస్టల్వార్డెన్, ఏపీఎం, ఐకేపీ ఏపీఎం పంచాయతీ కార్యదర్శి, జీపీవో పాల్గొన్నారు.

వృద్ధులకు దుప్పట్ల పంపిణీ

తాండూరు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): తాండూరు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం యాలాల మండలం కోకట్లో లయన్స్ క్లబ్ ప్రతినిధి చంద్రకాంత్చారి దాత సహకారంతో 60మంది వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్క్లబ్ అధ్యక్షుడు శరణ్ బసప్ప పాల్గొని మాట్లాడారు. పట్టణంలోని రెయిన్ బో ఆస్పత్రిలో ప్రతీనెల 2వ, 4వ గురువారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గౌరిశంకర్, చంద్రకాంత్చారి, సుధాకర్, నారాయణరెడ్డి, బాజరప్ప, శ్రీనివాస్రెడ్డి పాల్గొన్నారు.

పాఠశాలకు టీవీ బహూకరణ

దోమ, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బొంపల్లి గ్రామానికి చెందిన బోయిని చంద్రశేఖర్ టీవీని ఎంఈవో వెంకట్ ఆధ్వర్యంలో ప్రాథమిక పాఠశాలలలో శనివారం బహూకరించారు. డిజిటల్ బోధనకు విద్యార్థులకు ఎంతో దోహదపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ యాదవరెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ శాంతకుమార్, పాఠశాల చైర్పర్సన్ నసీమా బేగం, పంచాయతీ కార్యదర్శి మీనా, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు విజయ్కుమార్రెడ్డి, రాములు పాల్గొన్నారు.

వికారాబాద్లో ప్రధాని ప్రసార వీక్షణ

వికారాబాద్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): భగవాన్ బిర్సాముండా 150వ జయంతి సందర్భంగా శనివారం దేశవ్యాప్తంగా నిర్వహించిన జాతీయ గౌరవ వర్ష్ పక్వాడ ముగింపు కార్యక్రమంలో ఏర్పాటుచేసిన ప్రత్యక్ష ప్రసారంలో అధికారులు, విద్యార్థులు వీక్షించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. గిరిజన ప్రాంతాల అబివృద్ధికి వికారాబాద్ జిల్లాలో 13 మండలాలకు చెందిన 31 గిరిజన గ్రామాలను గుర్తించినట్లు అధికారులు అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ తెలిపారు. ప్రతీ గ్రామానికి రూ.2కోట్లు మౌలిక వసతులకు కేటాయించి వివిధ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సుధీర్, గిరిజన సంక్షేమాధికారి కమలాకర్రెడ్డి, పంచాయతీ అధికారి జయసుధ, సంక్షేమ అధికారి కృష్ణవేణి, డీఎంహెచ్వో స్వర్ణకుమారి తదితరులు పాల్గొన్నారు.



మోదీ ప్రత్యక్ష ప్రసారాన్ని వీక్షిస్తున్న జిల్లా అధికారులు

దళారులను నమ్మి మోసపోవద్దు



దౌల్తాబాద్: కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న పీఏసీఎస్ చైర్మన్ వెంకట్రెడ్డి



దోమ: కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న యాదవరెడ్డి

దౌల్తాబాద్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ధాన్యం విక్రయాల్లో రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని పీఏసీఎస్ చైర్మన్ వెంకట్రెడ్డి అన్నారు. మండలంలోని బాలంపేటలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో శనివారం వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ప్రభుత్వ మద్దతుధర కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ గాయత్రి, నాయకులు ప్రమోద్రావు, వెంకట్రెడ్డి, వెంకట్రావ్, వెంకట్రాములు కూర రాజు, పీఏసీఎస్, మార్కెట్ కమిటీ సిబ్బంది పాల్గొన్నారు.

దోమ: ప్రభుత్వ మద్దతు ధర వరి కొనుగోలు కేంద్రాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సొసైటీ చైర్మన్ యాదవరెడ్డి అన్నారు. మండల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో శనివారంబొంపల్లి, బాసుపల్లి గ్రామాల్లో వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సీఈవో యాదగిరి, పరిగి మార్కెట్ కమిటీ డైరెక్టర్ శాంతకుమార్, నాయకులు అంతిరెడ్డి, మాజీ ఎంపీటీసీ రాములు, చంద్రశేఖర్, శ్రీనివాస్, గ్రామస్థులు పాల్గొన్నారు.

ధాన్యం ఆరబోసి పడిగాపులు

తాండూరు రూరల్: చెంగోల్ గ్రామ శివారులో వందలాది ఎకరాల్లో పండించిన వరిధాన్యానికి కొనుగోలు కేంద్రం ప్రారంభించక పోవడంతో రైతులు పడిగాపులు కాస్తున్నారు. గ్రామ సమీపంలోని బైపాస్ రోడ్డులో పొలాల్లో పండిన వందలాది బస్తాల వరి ధాన్యాన్ని రోడ్డుపక్కన రైతులు ఆరబెట్టుకున్నారు. దీంతో కొనుగోలు కేంద్రం వారం రోజుల్లో ప్రారంభమవుతుందని అనుకున్న రైతులకు నిరాశే మిగిలింది. ఇప్పటికైనా జిల్లా మార్కెటింగ్ శాఖ ఉన్నతాధికారులు చెంగోల్ గ్రామశివారులో వరిధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.



తాండూరు మండలం చెంగోల్ బైపాస్ రోడ్డు పక్కన రైతులు ఆరబెట్టుకున్న వరి ధాన్యం

విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ



వికారాబాద్: స్వపరిపాలన దినోత్సవంలో ఉపాధ్యాయులు , విద్యార్థులు



చౌడాపూర్: స్వయం పరిపాలన దినోత్సవంలో విద్యార్థులు

వికారాబాద్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో స్వపరిపాలన దినోత్సవాన్ని విద్యార్థినులు ఉత్సాహంగా నిర్వహించారు. పదోతరగతి విద్యార్థినులు ఒక రోజు ఉపాధ్యాయులుగా బాధ్యతలు చేపట్టి జూనియర్లకు పాఠాలు బోధించారు. హెచ్ఎం శ్రీశైలం మాట్లాడుతూ విద్యార్థులు విద్యార్థి దశలోనే ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని సాధించే దిశగా కృషి చేయాలన్నారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చౌడాపూర్: మండల కేంద్రంలోని పీఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం విద్యార్థులు స్వయం పరిపాలన దినోత్సవాన్ని జరుపుకున్నారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ఉపాధ్యాయులు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రామకృష్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కులకచర్ల: మండలంలోని రాంనగర్ ప్రాథమిక పాఠశాలలో శనివారం స్వయం పరిపాలన దినోత్సవం జరుపుకున్నారు.ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు హెచ్ఎం రజని బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్ మల్లమ్మ, విద్యా కమిటీ చైర్మన్ వరలక్ష్మి పాల్గొన్నారు.

పూడూరు: మండలంలోని కంకల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం స్వయం పరిపాలన నోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులుగా, మంత్రి, కలెక్టర్, డిప్యూటీ కలెక్టర్, డీఈవో, ఎంఈవో, హెచ్ఎం పాత్రలో పోషించి వారి బాధ్యతలను నిర్వహించారు. ఇందులో కలెక్టర్గా హైమావతి, డిప్యూటీ కలెక్టర్గా యాస్మిన్, మంత్రిగా నవ్య, ఆర్జేడీ గా ప్రశాంత్కుమార్, డీఈవో గా వర్తిక, ఎంఈవోగా వైష్ణవి, హెచ్ఎంగా సాయి ప్రగతి బాధ్యతలను నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించి, బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఏపీసీ చైర్మన్ సోని, ప్రధానోపాధ్యాయురాలు పుష్ప, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

టెట్.. టెన్షన్

(ఐదో పేజీ తరువాయి)

ఉపాధ్యాయులు ఎంపికయ్యారు. అంతకుముందు నియామకమై సర్వీసులో కొనసాగుతున్న వారిలో కొందరు మాత్రమే టెట్ ఉత్తీర్ణత సాధించారు.

600 మంది ఉపాధ్యాయులు సేఫ్

జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని కేడర్లలో 4,387 ఉపాధ్యాయ పోస్టులు ఉండగా, వాటిలో 3,860 మంది ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. ఈ ఉపాధ్యాయుల్లో టెట్ అర్హత కలిగిన వారు 900 మంది వరకు ఉన్నట్లు తెలుస్తోంది. అయిదేళ్లలోపు ఉద్యోగ విరమణ చేయనున్న ఉపాధ్యాయులు 600 మంది వరకు ఉండగా, వారందరినీ టెట్ నుంచి మినహాయించిన విషయం తెలిసిందే. జిల్లాలో పనిచేస్తున్న 2,360 మంది వరకు ఉపాధ్యాయులు టెట్ అర్హత సాధించాల్సిన అవసరం ఏర్పడింది. రెండేళ్లలోగా అర్హత సాధించలేకపోతే ఉద్యోగ విరమణ చేయాల్సిందేనని సుప్రీం కోర్టు స్పష్టం చేయడంతో ఒత్తిడి తట్టుకోలేకపోతున్న కొందరు ఉపాధ్యాయులు స్వచ్ఛందంగా ఉద్యోగ విరమణ చేయాలని యోచిస్తున్నట్లు సమాచారం.

29వ తేదీ వరకు దరఖాస్తుకు అవకాశం

ఉపాధ్యాయ అర్హత పరీక్ష రెండో విడత నోటిఫికేషన్ గురువారం విడుదల కాగా, శనివారం నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమైంది. ఈనెల 29వ తేదీ వరకు అభ్యర్థులకు దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించారు. దరఖాస్తు చేసుకున్న వారికి జనవరి 3 నుంచి 31వ తేదీ వరకు ఆన్లైన్లో పరీక్షలు నిర్వహించనున్నారు. బీఎడ్, డీఎడ్ అర్హత సాధించని వారితోపాటు ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న టెట్ అర్హత లేని ఉపాధ్యాయులు కూడా టెట్కు పోటీపడనున్నారు. నిరుద్యోగులతోపాటు సర్వీస్లో కొనసాగుతున్న ఉపాధ్యాయులకు ఒకే విధమైన సిలబస్, అర్హత మార్కులు ఉండనున్నాయి. టెట్ అర్హత సాధించడానికి జనరల్, ఈడబ్ల్యూఎస్ వారికి 90 మార్కులు, బీసీలకు 75, ఎస్సీ ఎస్టీ, పీహెచ్సీ వారికి 60 మార్కులుగా నిర్ణయించిన విషయం తెలిసిందే.

ఆందోళనలో ఉపాధ్యాయులు

ఉపాధ్యాయ అర్హత పరీక్ష నుంచి మినహాయించే పరిస్థితులు దాదాపు లేవనేది స్పష్టం కావడంతో టెట్ అర్హత అవసరమైన ఉపాధ్యాయుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. విద్యా బోధనకు సంబంధించి ఇప్పటికే పలుమార్లు శిక్షణ పొందిన ఉపాధ్యాయులు మళ్లీ టెట్ పరీక్ష ఉత్తీర్ణత సాధించాలంటే ప్రతిరోజూ చదవాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. రోజూ వివిధ తరగతుల విద్యార్థులకు పాఠ్యాంశాలను బోధించడానికే ఉపాధ్యాయులు ఎక్కువ సమయం కేటాయించాల్సి వస్తోంది. పాఠశాల సమయంలో తరగతుల బోధన తప్ప ఏ మాత్రం తీరిక లేకుండా ఉండే ఉపాధ్యాయులకు టెట్ అర్హత ఎలా సాధించాలనే బెంగ పట్టుకుంది.

సమస్యల ఈ - పంచాయతీ

(ఐదో పేజీ తరువాయి)

కోసం కేరళ రాష్ట్రానికి పంపించి ఇక్కడ ఎన్పీఏ సర్వేను ఏడాదిపాటు చేయించి ఈ పంచాయతీ విధానాన్ని తీసుకువచ్చారు. ఈ విధానం మంచిదే అయినప్పటికీ అనేక లోసుగులతో గ్రామీణ ప్రాంతాల్లో సమస్యలు తలెత్తుతున్నాయి.

ఎవరికైనా రికార్డుల్లో 999 గజాలే..

గ్రామాల్లో ఇళ్ల స్థలాలకు సంబంధించి ఎవరికి ఎన్ని గజాల స్థలం ఉంది అనే విషయం సర్వేలో స్పష్టంగా పొందుపర్చలేదు. ఈ - పంచాయతీ పోర్టల్లో అన్ని ఇళ్ల స్థలాలకు 999 గజాలు ఉన్నట్లు పేర్కొన్నారు. స్థలాల సమస్య ఏర్పడితే పంచాయతీ కార్యదర్శులు ఏమీ చేయలేని పరిస్థితి. 1995 రీవిజన్ రిజిస్టర్ ఉంటే సమస్య పరిష్కరించే అవకాశం ఉంది. ఎవరిపేరిట ఇళ్లు ఉంటే వారి పేరు మీద ఇంటి పన్ను వసూలు చేసే అధికారం ఉన్నప్పటికీ ఇంటి యజమాని ఆయనే అని ధ్రువీకరించే అధికారం కార్యదర్శులకు, ఇతర పంచాయతీ అధికారులకు లేదు. ధ్రువీకరణ పత్రం జారీపై కొందరు కోర్టుకు వెళ్లారు. దీంతో ధ్రువీకరణ పత్రం ఇచ్చే విధానాన్ని నిలిపి వేశారు. 2021కు ముందు ఇళ్ల ధ్రువీకరణ పత్రం జారీ, ఆస్తులు, యజమానుల పేర్ల వివరాలు, మార్పులు, చేర్పులు వంటి వాటిని కార్యదర్శి లాగిగ్ ద్వారా సరి చేసుకునే అవకాశం ఉండేది. ఇప్పుడు ఆ విధానాన్ని ఎత్తివేశారు. పేరులో మార్పులు, చేర్పులు అధికారం కూడా ఈ పంచాయతీ విధానంలో లేదు.

ఇంటి పన్నులపై అవకతవకలు

ఈ - పంచాయతీ రాజ్ పోర్టల్లో కొన్ని గ్రామాల్లో పటిష్టంగా ఉన్న ఇళ్లకు జీరో పన్ను విధానం ఉంటే కూలిన ఇళ్లకు పన్ను విధిస్తూ ఆప్షన్ పెట్టారు. దీంతో ఎవరికి ఎంత పన్ను విధించాలో అనే విషయాన్ని పోర్టల్లో స్పష్టంగా పొందపర్చలేదు.

ఇళ్ల నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలి

కులకచర్ల, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను త్వరగా పూర్తిచేయాలని కాంగ్రెస్ నాయకులు అన్నారు. మండలంలోని తిరుమలాపూర్ గ్రామంలో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్లను శనివారం పరిశీలించారు. త్వరగా పూర్తి చేసి గృహ ప్రవేశం చేయాలన్నారు. రెండో విడతలోనూ అర్హులైన వారికి ప్రభుత్వం ఇళ్లను మంజూర్ చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల మాజీ అధ్యక్షుడు వెంకటయ్యగౌడ్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించాలి

బొంరాస్పేట్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ సమస్యలను వెంటనే పరిష్కరించాలని యూటీఎఫ్ మండల అధ్యక్ష, కార్యదర్శులు గొరారం గోపాల్, ఎండీ.అలీముద్దీన్ అన్నారు. మండలంలోని బొట్లవనితండా ఉన్నత పాఠశాల, చౌదర్పల్లి, నాందర్పూర్, నాగిరెడ్డిపల్లి, పూర్యనాయక్ తండా, నాందర్పూర్, బాపల్లితండా, బొంరాస్పేట్ ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులతో కలిసి శనివారం సభ్యత్వ నమోదు చేయించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎఫ్డబ్ల్యూ ఎఫ్ కార్యదర్శి నడిమింటి మల్లేశ్, జిల్లా కార్యదర్శి శివరాజ్, మండల ఎఫ్డబ్ల్యూ ఎఫ్ కన్వీనర్ నరేందర్గౌడ్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

'చిల్డ్రన్ బుక్ఆఫ్ రికార్డ్స్'లో డీఆర్ఎస్ విద్యార్థులకు చోటు



చిల్డ్రన్ బుక్ ఆఫ్ రికార్డు పురస్కారాన్ని అందుకుంటున్న విద్యార్థులు

మేడ్చల్ టౌన్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని కళలు, అథ్లెటిక్స్లో అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరిచిన గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ మైసమ్మగూడలోని డీఆర్ఎస్ పాఠశాలకు చెందిన ఐదుగురు విద్యార్థులకు చిల్డ్రన్స్ బుక్ఆఫ్ రికార్డు సాధించారు. ఈ సందర్భంగా పురస్కారం అందుకున్న విద్యార్థులకు శనివారం పాఠశాల యాజమాన్యం అభినందిస్తూ సన్మానించారు. ఈ కార్యక్రమంలో డీఆర్ఎస్ డైరెక్టర్ సంజయ్ అగర్వాల్, ప్రిన్సిపాల్ వేణుగోపాల్, వైస్ప్రిన్సిపాల్ పూజ సక్సేనా వినోద్ రంజన్ తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్కు కాంగ్రెస్ నాయకుల సన్మానం



తహసీల్దార్ వెంకటేశ్వర్లును సన్మానించిన కాంగ్రెస్ నాయకులు

చౌడాపూర్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): చౌడాపూర్ నూతన తహసీల్దార్ వెంకటేశ్వర్లును కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఎల్పటి అశోక్కుమార్ ఆధ్వర్యంలో శనివారం సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలో రెవెన్యూ సమస్యల పరిష్కారానికి కృషిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడు నర్సింహానాయక్, ప్రధాన కార్యదర్శి దామోదర్రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ సలీమ్, కాంగ్రెస్ యువజన మండల అధ్యక్షుడు రాము, మాజీ సర్పంచ్ శేఖర్, నాయకులు రాజేందర్రెడ్డి, అనంత్రెడ్డి, శశిధర్రెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా అయ్యప్పస్వామి పడిపూజ

మోమిన్పేట్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మొరంగపల్లిలో శనివారం మాజీ ఎంపీపీ ఒగ్గు మల్లయ్య యాదవ్ ఆధ్వర్యంలో పడిపూజను నిర్వహించారు. ధర్మశాస్త్ర సన్నిదానంలో నిర్వహించిన పడిపూజతో మొరంగపల్లి అనంతగిరి పుణ్యక్షేత్రం అయ్యప్పనామస్మరణతో మారుమోగింది. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ఒగ్గు మల్లయ్య యాదవ్, గురుస్వాములు శ్రీనివాస్రెడ్డి, తిరుపతిరెడ్డి, శ్రీనివాస్రెడ్డి, సుధాకర్, శివకుమార్ యాదవ్, జనార్ధన్రెడ్డి, బలవంత్రెడ్డి, వెంకట్రెడ్డి, ఒగ్గు మల్లయ్య, గణేశ్, శివకుమార్, సాయి పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణంపై తహసీల్దార్కు ఫిర్యాదు

ఘట్కేసర్ రూరల్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వభూమిలో అక్రమంగా చేపట్టిన నిర్మాణంపై చర్యలు తీసుకోవాలని చౌదరిగూడకు చెందిన బీ శ్రీరాములు, గ్రామస్థులు శనివారం తహసీల్దార్ చంద్రశేఖర్కు ఫిర్యాదు చేశారు. కొర్రెముల రెవెన్యూ పరిధి ప్రభుత్వభూమి సర్వేనంబర్ 867లో కొందరు మద్యందుకాణం కోసం అక్రమంగా నిర్మాణం చేపడుతున్నారని తెలిపారు. ప్రభుత్వభూమిలో అక్రమ నిర్మాణం చేస్తున్న వ్యక్తులపై చర్యలు తీసుకొని ప్రభుత్వభూమిని కాపాడాలని తహసీల్దారర్కు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

దోమ, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని కిష్టాపూర్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు లాల్యానాయక్ అన్నారు. మండలంలోని మెట్టుగడ్డ తండా ప్రాథమిక పాఠశాలను శనివారం ఆయన సందర్శించారు. విద్యార్థులతో చదివించి వారి సామర్థ్యాలను పరిశీలించారు. అనంతరం మండలంలోని పలు పాఠశాలల్లో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు సత్యనారాయణ, ఉపాధ్యాయులు రాకేశ్ పాల్గొన్నారు.

బస్సు ప్రమాద మృతులకు ఆర్థిక సాయం

యాలాల, నవంబరు 15, (ఆంధ్రజ్యోతి): చేవెళ్ల వద్ద జరిగిన బస్సు ప్రమాదంలో మృతిచెందిన హాజీపూర్ గ్రామానికి చెందిన భార్య, భర్తలు బందెప్ప, లక్ష్మి పిల్లలను, కుటుంబాన్ని చేవెళ్ల విలేకరులు పరామర్శించారు. కార్తిక్రెడ్డి పంపిన రూ.2లక్షలతోపాటు చేవెళ్ల విలేకరులు ప్రభ చేసిన రూ.68,600లు మృతుల పిల్లలు భవాని, శివలీలలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శ్రీనివాస్, గ్రామస్థులు రవికుమార్ తదితరులున్నారు.

స్వీయ రక్షణపై అవగాహన ఉండాలి



చట్టాలపై అవగాహన కల్పిస్తున్న శ్రీదేవి

తాండూరు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): స్వీయ రక్షణపై బాలికలు అవగాహన కలిగి ఉండాలని లర్నింగ్ స్పేస్ ఫౌండేషన్ డైరెక్టర్ పుట్ట శ్రీదేవి అన్నారు. తాండూరులోని తెలంగాణ బాలికల గురుకుల పాఠశాల, కళాశాలలో శనివారం బాలికల భద్రత వారోత్సవాలలో భాగంగా అరుణ ఫౌండేషన్ సౌజన్యంతో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బాలికలకు అవగాహన కల్పించారు. తమ సంస్థ ఆధ్వర్యంలో 76 వేల మంది బాలికలకు 42వేల మంది మహిళలకు స్వీయ రక్షణ చట్టాలపై అవగాహన కల్పించామన్నారు. ఈ కార్యక్రమంలో వికారాబాద్ తెలంగాణ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్, ఏజీవో వెంకట్రెడ్డి, తాండూరు గురుకుల ప్రిన్సిపాల్ ప్రవీణా, ఫౌండేషన్ కన్వీనర్ జానకి రామ్ పాల్గొన్నారు.